యం. జయశ్రీ

# లవ్ ట్రా(ప్)క్

## “ది రివెంజ్”



చిలకలూరి పేట బస్ దిగగానే రిక్షాలో నాగేందర్ ఇంటికి వెళ్ళింది వనజ.

తాళం వేసి వుంది. అలాగే గడపలో కూర్చుంది.

ఒక అరగంట తర్వాత.

మాంచి ఉషారుగా ఈల వేసుకుంటూ వస్తున్నాడు నాగేందర్.

వనజను చూడగానే టక్కున ఆగిపోయి

“ఏమిటే... వనజా... ఈ వూరేమైనా క్యాంప్‌కు వచ్చావా? వెకిలిగా నవ్వుతూ ఇంటి తలుపులు తెరిచా డు.

“క్యాంప్ పడాలా..? నీకోసం రాకూడదా? గారాబంగా అంది.

“ఓసోసి... వగలమారీ! నన్నెప్పుడూ ఛీదరించుకొంటావ్... నాకోసం వత్తావేంటి? రా లోపలికి” ఇంట్లోకి దారి తీశాడు.

“ఇదిగో నాగేందర్... కోపం జన్మంతా వుంటుందా? మావూళ్ళో వుండి... వుండి విసిగిపోయాను.

ఎక్కడికైనా వెళ్దామన్నా నన్నెవరు రానిత్తారు? నువ్వే గుర్తుకొచ్చావు...

మెత్తగా అంటున్న వనజ మాటలకి నాగేందర్‌కి నిజంగా నమ్మకం కుదిరింది.

“ఇన్నాళ్ళకి నా విలువ తెలిసిందన్నమాట... యువారం ఎలావుంది?” కన్ను గొట్టి మరీ అడుగుతూ మూలనున్న క్యారియర్ చేతిలోకి తీసుకొన్నాడు నాగేందర్.

“నా వ్యాపారం సంగతి ఏంలేగానీ ఆ క్యారియర్ ఎందుకు ... నేను వంట చేస్తాను” కొంగుతీసి నడుంచుట్టూ దోపింది. ఆశ్చర్యంగా చూస్తూ నాగేందర్.

“వనజా... నువ్వు పూర్తిగా మారావే ఏదీ... ముందుగా నాముద్దు తీర్చు” అంటూ ఆమెను అమాంతం ఎత్తి మంచమ్మీద వేశాడు.

కిలకిలా నవ్వింది వనజ.

నాగేందర్ దగ్గర వారంరోజులుండి తిరిగి బయల్దేరింది వనజ.

“వనజా... అప్పుడప్పుడూ ఇలాగే రావే నాకెందుకో నిన్ను వదలబుద్ది కావటం లేదు” అంటూ నిజంగా బాధపడిపోతూ వీడ్కోలు ఇచ్చాడు నాగేందర్.

* * *

వనజ తిరిగి వచ్చిందన్న సంగతి తెలిసి పక్కగదిలో వుండే అరుణ గబగబా వచ్చింది.

“ఏమే వనజా... నిన్ను డాక్టర్ ఎక్కడికీ కదలవద్దని రెస్ట్‌తీసుకోమంటే ఎక్కడికెళ్ళావే... నీకింకా సంపాదించాలన్న తాపత్రయమేనా? అభిమానంగా కోప్పడింది.

“ఛ... అందుక్కాదే నేవెళ్ళింది – ఇన్నాళ్ళకి నా పగ చల్లారిందే!”

“ఏమిటే...? అర్థం కాలేదు అరుణకి.

“నన్ను మోసంచేసి ఈ వృత్తిలోకి దించిన ఆ నాగేందర్‌గాడి అంతం ఇంకొన్ని రోజుల్లోనే! నాకొచ్చిన కొత్తరోగం ‘ఎయిడ్స్’ వాడికి అంటించివచ్చాను. ఇంక నేను తృప్తిగా చస్తాను”

వనజ కళ్ళలో కన్నీటి చుక్కలు టప్‌న కిందరాలాయి.

*